ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 261
పేజీలు : 5 వెల రూ. 2/-
ఆదివారం
11 డిసెంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## గంటల తరబడి ఎదురుచూపులు..

అయినా దొరకని బస్సులు, ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



2 లో

# నేను సామాజిక వైద్యుడిని..

- ప్రజారోగ్య సంరక్షణకు అమిత ప్రాధాన్యమిస్తున్నా
- ఫెలోస్ ఇండియా సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- రోగుల నాడి పట్టడం మరవొద్దని వైద్యులకు సూచన

నేను వైద్యుడిని కాదు. కానీ, సోషల్ డాక్టర్‌ని. సామాజిక రోగాలపై మాట్లాడతా. మీరంతా సమాజాన్ని ప్రభావితం చేసే ప్రత్యేక వర్గం. మీరు మా ప్రాణాలను కాపాడతారని మేమంతా బలంగా నమ్ముతాం. ఈ క్రమంలో మనుషులపై, సమాజంపై మీ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దు" అని వైద్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. వివరాలు 2లో



## ఎఫ్ఆర్‌బీఎం పరిమితి 4 శాతానికి పెంచాలి

- విద్య, వైద్యానికి సమీకరించే ఆర్థిక వనరులను
- రాష్ట్ర రుణపరిమితి నుంచి మినహాయించాలి
- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ప్రకటించాలి
- ఐఐఎం, నవోదయ విద్యాలయాలు కేటాయించాలి
- నిర్మలా సీతారామన్‌కు భట్టి విక్రమార్క వినతి

2 లో



## నన్ను అవమానించి ఏం సాధిస్తారు?

- మహిళా అధికారులపై తప్పుడు కథనాలు ప్రసారం చేశారు
- ఐఏఎస్‌ల కుటుంబాలు ఎలా తట్టుకుంటాయి?: కోమటిరెడ్డి ఆవేదన
- సినిమా టికెట్ల ధరల పెంపుపై ఏ దస్త్రమూ తన వద్దకు రాలేదని వెల్లడి

2 లో



# ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతరు?

- పురపోరులో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
- రెండేండ్ల పాలనలో పట్టణాలకు రూపాయి కూడా ఇవ్వని ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్‌దే
- పురపోరులో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
- పట్టణాలకు ఇచ్చిన నిధులు, చేసిన అభివృద్ధిని చూపించి కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం
- హాజరైన పార్టీ సీనియర్ నేత హరీశ్, ఆయా జిల్లాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు



2 లో

# ఎఫ్ఆర్‌బీఎం పరిమితి 4 శాతానికి పెంచాలి

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :
సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తున్న రాష్ట్రాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేలా ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 3.5 శాతం నుంచి 4 శాతానికి పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీలేని రుణాలను గ్రాంట్లుగా మార్చడంతోపాటు, ప్రస్తుతం ఇస్తున్న సాయాన్ని రెట్టింపుచేయాలని కోరారు. బడ్జెట్ ముందస్తు కసరత్తులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం ఇక్కడ నిర్వహించిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొని తెలంగాణ ప్రభుత్వ డిమాండ్లు వినిపించారు.
“2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నా. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1% ఉంది. దీన్ని 10 శాతానికి పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారు. ఈ క్రమంలో తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడుల రేటును 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. ఈ వెసులుబాటు కల్పించడానికి రాష్ట్రాల ఆర్థికలోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి. రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చడంతోపాటు ప్రస్తుత సహాయాన్ని రెట్టింపు చేయాలి” అని కోరారు.

కేంద్ర మంత్రికి భట్టి విన్నవించిన అంశాలివీ..

రాష్ట్ర ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటుచేయడంతోపాటు, అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్య కళాశాలలను నెలకొల్పుతున్నందున విద్య, వైద్య రంగాలకోసం సేకరించే ఆర్థిక వనరులను ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయించాలి.

కేంద్రం 20 శాతం కంటే ఎక్కువగా రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లోని అంశాలపైనే ఖర్చు చేస్తోంది. ఇలా ఖర్చు చేస్తున్న దాంట్లో 25 శాతం తగ్గించి, తద్వారా మిగిలే రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

సెస్‌లు, సర్‌ఛార్జీల ద్వారా కేంద్రానికి దాదాపు 20% ఆదాయం వస్తోంది. ఈ ఆదాయాన్ని పన్నుల్లో చూపకపోవడంవల్ల అందులో వాటా రాష్ట్రాలకు రావడంలేదు. దీనివల్ల ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రాలకు రావాల్సిన 41 శాతం వాటాకు బదులు 30 శాతమే అందుతోంది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి రూ.1.55 లక్షల కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించి, రాష్ట్రాలకు అందించాలి. లేదంటే ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు పంపిణీచేయాలి.

ఉపాధిలో అదనపు భారాన్ని కేంద్రమే భరించాలి.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తెచ్చిన వీబీజీరాంజీ చట్టంవల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వాటా 90:10 నుంచి 60:40కి మారింది. దీనివల్ల రాష్ట్రాలపై ఆర్థికభారం పెరిగిపోతుంది. సాధారణ కేటాయింపులకు మించి పనిదినాలు పెరిగితే ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుంది. ఇది డిమాండ్‌కు తగ్గట్టు పని కల్పించడానికి తీవ్ర ఇబ్బందిగా మారుతుంది. మూలధన వ్యయానికి అవసరమైన నిధులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ అదనపు భారాన్ని కేంద్రమే భరించాలి.

వీటిని మంజూరు చేయండి

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి.

తెలంగాణకు సెమీకండక్టర్ ప్రాజెక్టు, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ మంజూరుచేయాలి. ఇందుకోసం రంగారెడ్డి జిల్లా తాటిపర్తిలో భూమి సిద్ధంగా ఉంది.

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు రూ.14,100 కోట్లు, రేడియల్ రోడ్లకు రూ.45,000 కోట్లు, హైదరాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి రూ.17 వేల కోట్లు మంజూరు చేయాలి. వికారాబాద్ నుంచి కృష్ణా వరకు కొత్త రైల్వేలైన్ కోసం రూ.2,677 కోట్లు, హైదరాబాద్- చెన్నై హైస్పీడ్ రైల్‌కారిడార్ నిర్మాణానికి రూ.17,212 కోట్ల ప్రాజెక్టులను సానుకూలంగా పరిగణనలోకి తీసుకోవాలి.

తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలి.

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి.

హైదరాబాద్‌లో ఐఐఎం, జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి.

పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలకు విమానాశ్రయాలు మంజూరు చేయాలి.

16వ ఆర్థికసంఘం సిఫార్సులను యథతథంగా ఆమోదించండి

15వ ఆర్థికసంఘం.. రాష్ట్రాల వారీగా చేసిన ప్రత్యేక సిఫార్సుల అమలును కేంద్ర ప్రభుత్వం తొలిసారి విస్మరించింది. దానివల్ల తెలంగాణ స్టేట్‌స్పెసిఫిక్ గ్రాంట్లు రూ.2,362 కోట్లు, సెక్టార్ స్పెసిఫిక్‌గ్రాంట్లు రూ.3,024 కోట్ల మేర కోల్పోయింది. ఇప్పుడు 16వ ఆర్థికసంఘం రాష్ట్రాలకు ప్రత్యేకంగా చేసిన సిఫార్సుల ఆమోదంలో అలాంటి తప్పుచేయకుండా యథతథంగా అమలుచేయాలి.

# నన్ను అవమానించి ఏం సాధిస్తారు?

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :
‘దేవుడు అంటే నాకు నమ్మకం.. నేను తెలిసి ఏ తప్పూ చేయను. నా కుమారుడు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయా. ఇంకా నన్ను మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు. నన్ను అవమానించి ఏం సాధిస్తారు? నేను తప్పు చేస్తే దేవుడు శిక్షిస్తాడు. చేతులెత్తి నమస్కారం చేస్తున్నా.. తప్పుడు కథనాలు ప్రచారం చేయొద్దు” అంటూ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులపై తప్పుడు కథనాలు ప్రసారం చేశారని.. వారిని మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. “రాజకీయాల్లో విమర్శలు సహజం. రాజకీయ నాయకులమైనా మేము తట్టుకుంటాం. ఐఏఎస్ అధికారుల కుటుంబాలు ఎలా తట్టుకుంటాయి? ఏం ఆధారాలు ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు టీవీలో ప్రసారం చేస్తారు? ఇదంతా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలన్న ఉద్దేశమేమో అన్న అనుమానం కలుగుతోంది. మీకూ కుటుంబాలు ఉంటాయి. కాస్త ఆలోచించండి. కలెక్టర్ల బదిలీలో నా ప్రమేయం ఉందని అన్నారు. వారిని బదిలీ చేసే అధికారం మంత్రుల చేతుల్లో ఉండదు. జిల్లా మంత్రులకు సమాచారం ఇచ్చి బదిలీలు చేయరు. సీఎం, సీఎస్ మాత్రమే బదిలీలు చేస్తారు. ఎంతో కష్టపడితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతారు. అలాంటి వారిపై అభాండాలు వేయవద్దు. అసత్య ప్రచారంపై డీజీపీ శివధర్‌రెడ్డితో మాట్లాడా. సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీజీపీ చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో సీఎంతో సహా మంత్రులపై దుష్ప్రచారం చేయడం సరికాదు” అంటూ భావోద్వేగంతో మాట్లాడారు.

పుష్ప సినిమా తర్వాత బెనిఫిట్ షోలు.. టికెట్ ధరల పెంపు ఉండదని చెప్పా

“సినిమా పరిశ్రమపై దృష్టి పెట్టలేదు. పుష్ప సినిమా తర్వాత బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఉండదని చెప్పా. దీని కోసం నా వద్దకు రావొద్దన్నా. తాజాగా సినిమా టికెట్ల ధరల పెంపునకు సంబంధించిన ఏ దస్త్రమూ నా వద్దకు రాలేదు. టికెట్ల ధర పెంపుపై నన్ను ఎవరూ సంప్రదించలేదు. ఎదుటివారు బాధపడితే స్పందించే గుణం నాది. పుష్ప సమయంలో మహిళ చనిపోతే రూ.25 లక్షల సాయం అందించా. బాధిత అబ్బాయిని సాదుకుంటాను...చదివిస్తాను అని చెప్పా” అని మంత్రి వివరించారు.

రద్దీ ఉన్నప్పుడు టోల్ గేట్లు ఎత్తేయాలని కేంద్రానికి చెప్పా

“సంక్రాంతి పండగకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేవలం టోల్‌గేట్ల వద్ద ఒకటిన్నర నిమిషం వరకు ఆలస్యం జరుగుతోంది. రెండు రోజుల కిందటే సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని చెప్పా. రద్దీ ఎక్కువ ఉన్నప్పుడు టోల్‌ఛార్జీలు లేకుండా గేట్లు ఎత్తివేయాలని కేంద్రానికి చెప్పా. రద్దీ దృష్ట్యా ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశాం. అత్యవసర పరిస్థితుల కోసం టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉంటుంది. ప్రమాదం జరిగితే అవసరమైతే హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తాం” అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# ఏముఖం పెట్టుకొని ఓట్లడుగుతరు?

హైదరాబాద్, జనవరి 10 :
రెండేండ్లుగా రూపాయి కూడా ఇవ్వకుండా పట్టణాలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ సర్కార్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. అధికారం చేపట్టిన రెండేండ్లలో పట్టణాలకు నిధులివ్వని ఏకైక ప్రభుత్వం రేవంత్‌రెడ్డిదేనని విమర్శించారు. పట్టణాలకు ఇచ్చిన నిధులు, చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు. హైదరాబాద్‌లో శనివారం ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పార్టీ శ్రేణులతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పురపోరులో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని, పారిశుధ్యం మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ ఒక్కపనీ చేయలే

బీఆర్ఎస్ హయాంలో మంజూరైన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మంచి పని ఒక్కటీ లేదని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, మాడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక కార్యక్రమానికీ నిధులు బంద్ చేయడంతో అన్ని కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఓవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని, మరోవైపు పట్టణాలను పడుకోబెట్టి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందని నిలదీశారు. ఈ రెండు సంవత్సరాల్లో ఆయా పట్టణాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇచ్చిన నిధులను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు.



కలిసికట్టుగా కొట్లాడాలి

మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ శ్రేణులు అందరూ కలిసికట్టుగా కొట్లాడి ఎన్నికల్లో మంచి మెజారిటీతో విజయం సాధించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పట్టణాల్లో వార్డులవారీగా కూడా బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో పేరుకుపోయిన సమస్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, అంశాలను ప్రస్తావిస్తూ చేపట్టాల్సిన చర్యలు చెప్పారు. రెండు జిల్లాల్లో పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను తట్టుకొని మంచి ఫలితాలు సాధించామని, అదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరైన ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేత, శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు కూడా పలు అంశాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. పురపోరులో అనుసరించాల్సిన వ్యూహాలపై పలు సూచనలు చేశారు. ఆయా జిల్లాల నేతలు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పార్టీ సీనియర్ నేతలకు వివరించారు. ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో తీవ్రవ్యతిరేకత ఉన్నదని, బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉన్నదని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ శ్రేణులు కలిసికట్టుగా కొట్లాడి మంచి మెజారిటీతో విజయం సాధించాలి. పట్టణాల్లో వార్డులవారీగా కూడా బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో పేరుకు పోయిన సమస్యలను ప్రజలకు వివరించాలి. పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను తట్టుకొని మంచి ఫలితాలు సాధించినం. అదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలి.

# పిఠాపురంలో గొడవలు చేస్తామంటే ఏరిపారేస్తా

- అవాస్తవాలు వైరల్ చేస్తూ చూస్తూ ఊరుకోను
- శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి
- పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి
- సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్
- సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు

కాకినాడ:
పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన ‘పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించనని ఘాటుగా హెచ్చరించారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలన్నారు ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదన్నారు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరిశ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని పవన్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన సొంత నియోజకవర్గం కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.. అయితే, స్థానిక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పవన్.. పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం కమిషనర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్ర పరిస్థితులను చూసి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలు ఇంత చెత్తగా ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి? నేను అయితే ఇలాంటి చోట ఒక్క రోజు కూడా ఉండలేను. అసలు నేను చీపురు పట్టి రోడ్లు తుడవాలా? అంటూ అధికారులను నిలదీశారు. ఇక, పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ విఫలమవుతున్న నేపథ్యంలో.. 'గుడ్ మార్నింగ్ పిఠాపురం' కార్యక్రమాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించాలా? అని పవన్ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు అందించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పిఠాపురం అభివృద్ధి కోసం పాడా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించినా, దాని అమలు విషయంలో వేగం లేకపోతే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. అవసరమైతే రాజకీయ-పరమైన అడ్మినిస్ట్రేషన్ నిర్ణయాలు తీసుకోలేరా? అభివృద్ధి కోసం ప్రభుత్వం గట్టి అడుగులు వేయొద్దా? అని అధికార పార్టీ నేతలను, యంత్రాంగాన్ని నిలదీశారు. కాలనీల్లో నడుచుకుంటూ సమస్యలు తెలుసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, పవన్ కల్యాణ్ పిఠాపురం కాలనీల్లో నడుచుకుంటూ వెళ్లి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ, మౌలిక వసతుల కొరతపై ప్రజలు చెప్పిన అంశాలను ఆయన నోట్ చేసుకున్నారు. అయితే, పిఠాపురం పారిశుధ్య వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని, అధికార యంత్రాంగం ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.



## ముగ్గుల పోటీల్లో బహుమతి గెలిచిన ఇరికి సరిత

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :



సంక్రాంతి పర్వదినం వస్తున్న సందర్భంగా 8 ఇంక్లైన్ కాలనీ 17 వ డివిజన్,సంతోష్ నగర్ సతయ్య కిరాణం ప్రధాన రోడ్డు పై నిర్వహించిన ముగ్గుల పోటీల్లో దాదాపుగా 50 మంది మహిళా మూర్తులు పాల్గొని ముగ్గులు వేయడం జరిగింది. అందులో భాగంగా ఇరికి సరిత కు బహుమతి గెలుచుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ధీరజ్ గౌడ్, ఇరికి రాజేశ్వరి, స్రవంతి, ఈశ్వర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### శివాంజనేయ దేవాలయానికి

## నూతన కమిటీని ఎన్నుకోవాలి

ఏ ఎం న్యూస్ ఓయూ:
తార్నాక హనుమాన్నగర్‌లోని శివాంజనేయ దేవాలయానికి నూతన కమిటీని ఎన్నుకోవాలనీ హను మాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొట్టం భూపాల్రెడ్డి, ఎర్రకుంట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మగల్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం వారు వేరు వేరుగా పత్రికా ప్రకటనలను విడుదల చేశారు. ప్రతి మూడేళ్లకు ఒక సారి దేవాలయం ఎన్నికలు నిర్వహించి కొత్త కమిటీని ఎన్నుకోవాల్సి ఉందన్నారు. కానీ కొందరు వ్యక్తులు గత 20 ఏళ్లుగా గుడిని తమ ఆధిపత్యంలోనే కొనసాగిస్తున్నారనీ ఆరోపిస్తున్నారు. దేవాలయం నిర్వాహణ, గడి ఆదాయం లెక్కలు ఎవరికీ తెలియడం లేదన్నారు. తార్నాక, హనుమాన్ నగర్, ఎర్రకుంట ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం శివాంజనేయ దేవాలయం అభివృద్ధికి ఎ ప్రజలందరి భాగస్వామ్యం ఉండేలా నూతన కమిటీనీ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనిపై ప్రస్తుతం దేవాలయాన్ని తమ ఆధీనంలో కొనసాగిస్తున్న వ్యక్తులు ఇంద్రసేనారెడ్డి వెంటనే స్పందించి వచ్చే 15 రోజుల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అడహక్ కమిటీనీ ఏర్పాటు చేయాలనీ సూచించారు. లేనిచో దేవాలయం వద్ద స్థానికులందరితో కలిసి ధర్నా చేస్తామనీ హెచ్చరించారు.

## నేను సామాజిక వైద్యుడిని..

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :
హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫెడరేషన్(ఐసీఆర్‌టీఎఫ్), మెడికవర్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఫెలోస్ ఇండియా-2026 సదస్సులో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... “ప్రజల ఆరోగ్య సంరక్షణకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. వైద్యారోగ్య రంగాల అభివృద్ధికి ఉత్తమ పాలసీల కోసం వైద్యులతో కలిసి పనిచేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్‌కేర్ ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచమంతా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వైపు వేగంగా పరుగులు తీస్తోంది. మీరు కూడా అధునాతన సాంకేతికతను సొంతం చేసుకోవాలి. అదే సమయంలో రోగుల నాడిని పట్టుకోవడం విస్మరించొద్దు. ప్రస్తుతం గుండె జబ్బులు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు మనమందరం కలిసి కృషి చేయాలి.
విద్యార్థులకు సీపీఆర్ నేర్పించేందుకు వైద్యులు స్వచ్ఛందంగా ముందుకొస్తే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చు. ఇలాంటి సదస్సులు హైదరాబాద్‌లో జరగడం నాకెంతో గర్వంగా ఉంది. మీరంతా విజయవంతమైన కార్డియాలజిస్టులు. అయినా ఎప్పటికప్పుడు మీ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు బాగా ఉపయోగపడతాయి. నిరంతరం నేర్చుకోవడమే అతిపెద్ద విజయ రహస్యం. కొత్త విషయాలను తెలుసుకోవడం, నైపుణ్యాన్ని పెంచుకోవడం మానేస్తే కెరీర్‌కు ముగింపు పలికినట్లే’ అని సీఎం స్పష్టంచేశారు. ఈ సదస్సులో భాగంగా క్లిష్టమైన కరోనరీ యాంజియోప్లాస్టీలు, ఆధునిక వాల్వులర్ ప్రొసీజర్లు, కొత్త వైద్య పరికరాలు, భవిష్యత్ కార్డియాలజీపై వైద్యులు ప్రత్యేక చర్చ నిర్వహించారు. సదస్సులో మెడికవర్ సీఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణ, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.ప్రతాప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంటల తరబడి ఎదురుచూపులు..

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :
సొంత ఊరికి వెళ్లే ప్రయాణికులతో రాష్ట్ర వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. అత్యధిక సంఖ్యలో పట్నం నుంచి ఊరుబాట పట్టారు. ఓవైపు సరిపడా లేని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి బయలుదేరే అన్ని బస్సులూ పరిమితికి మించి ప్రయాణిస్తున్నాయి. బస్టాండ్ వచ్చిన క్షణాల్లోనే బస్సులు నిండిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. టీజీఎస్ఆర్టీసీ 6,431 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా ప్రయాణికుల సమస్యలను తీర్చలేకపోతున్నాయి. బస్సులు సరిపడా లేకపోవడంతో చాలా మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు కార్‌పూలింగ్ సేవలు కూడా వినియోగించుకుంటున్నారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కండి

**మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్యం మా లక్ష్యం**
**వైద్యారోగ్య శాఖ అధికారుల వర్క్‌షాపులో మంత్రి సత్యకుమార్**

విజయవాడ:
ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాళ్లతో మంత్రి.. ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్య, విద్య అందించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో వైద్య రంగంలో ప్రతికూలతలు ఎదుర్కొంటూనే సేవలందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపీ, ఐపీ, ఇతర సేవలు గతంతో పోలిస్తే 12శాతం పెరిగాయని చెప్పుకొచ్చారు. రోగులు అధిక శాతం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా చేయగలిగామని వ్యాఖ్యానించారు. డాక్టర్లు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. కింది స్థాయిలో 28శాతం అవినీతి ఉందని తెలుస్తోందన్నారు. పారిశుధ్యంలో ఇంకా మార్పు రావాల్సి ఉందని తెలిపారు. బోధనాస్పత్రుల్లో అనుమతించిన బెడ్లు 500 వరకూ ఉంటున్నాయని వివరించారు. ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా మంచాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో మార్పులు రావాల్సి ఉందని చెప్పుకొచ్చారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో వైద్య సేవలు అందుబాటులోకి రావాల్సి ఉందని తెలిపారు. ఎబిహెచ్ఎ యాప్ ఐడీ జనరేట్ చేసేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. చాలాచోట్ల ఎఫ్ఎంఓలు లేకపోవడం ప్రధాన అంశంగా కనిపిస్తోందని అన్నారు. సూపరింటెండెంట్‌లు, అడ్మినిస్ట్రేషన్ మధ్యలో సరైన కోఆర్డినేషన్ ఉండట్లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురంలోని ఆస్పత్రుల్లో చాలా అంశాల్లో లోపాలు తన దృష్టికి వస్తుంటాయని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సూపరింటెండెంట్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్ వెల్‌నెస్ వైపు ప్రభుత్వ వైద్యులు అందరూ ఆలోచించాలని కోరారు. ఆరు నెలలు సెకండరీ ఆస్పత్రుల్లో, ఆరు నెలలు బోధన ఆసుపత్రుల్లో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సొంతూళ్లలో పని చేయాలని చూసేవారు అటెండెన్స్ తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. కొత్త బోధనాస్పత్రులకు ఇంకా నిర్మాణమే మొదలవలేదని చెప్పుకొచ్చారు. ÷ఎఎ÷ని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీగా చేయాలంటే రూ.1000 కోట్లు కావాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని.. ఇవాళ అన్నీ కావాలంటే కొంత సమయం పడుతుందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలంటే ప్రధాన భూమిక డాక్టర్లదేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.
మూడు నెలల్లో ఆస్పత్రుల పరిస్థితి మారాల్సి ఉందని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సెక్రెటరీ సౌరభ్ గౌర్ సూచించారు. ఆరు నెలల్లో అత్యుత్తమ ఆస్పత్రులుగా మారాలని పేర్కొన్నారు. సంజీవనిలో పౌరులకు ఇచ్చే సేవలు తెలియాలని చెప్పుకొచ్చారు.

# సికింద్రాబాద్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే పోరాటమే

## కాంపల్లి శ్రీనివాస్ సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి

ఏ ఎం న్యూస్ ఓయూ:
ఎన్నో ఏళ్ల చారిత్రక నేపథ్యం, ట్విన్ సిటీస్ గా విశ్వవ్యాప్తంగా పేరున్న సికింద్రాబాద్ పేరు లేకుండా కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం తీవ్రమైన అన్యాయమని, సికింద్రాబాద్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే పోరాటం తప్పదని కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో మైలారగడ్డలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసి పునర్విభజన పేరిట ఏక పక్షంగా సికింద్రాబాద్ పేరు లేకుండా కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి సికింద్రాబాద్ పేరిట కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ పేరును రూపుమాపాలనుకునే ప్రక్రియను తక్షణమే విరమించుకొని స్థానిక ప్రజల, ప్రజా సంఘాల రాజకీయాలకు పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని సికింద్రాబాద్ పేరుతో కార్పొరేషన్ ను కొనసాగించాలని కోరారు. ఈ ప్రక్రియ జరిగేంతవరకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలని, ఆ దిశగా జరిగే పోరాటంలో సిపిఐ పార్టీ ముందు వరసలో ఉంటుందని తెలియజేశారు.



చలో ఖమ్మం 18న జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరండి సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిస్తూ బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, గౌస్ శ్రీహరి, రవి ,రమేష్, కుమార్, సంపత్, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగింపు దేశచరిత్రకు అవమానం

## - కాంగ్రెస్ నేతల ఆగ్రహం



ఏ ఎం న్యూస్ , హైదరాబాద్:
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అమానుషమైన చర్య అని, ఇది బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న రాజకీయ నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా విమర్శించారు. ఈ రోజు సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫలమండిలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దీపక్ జాన్, అదం సంతోష్ కుమార్, కోట నీలిమ తదితరులు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ పేరు భారతదేశానికి మాత్రమే కాక ప్రపంచవ్యాప్తంగా అహింస, సత్యం, శ్రమకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. అలాంటి మహనీయుడి పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం తన గాంధీ వ్యతిరేక భావజాలాన్ని మరోసారి బహిర్గతం చేసిందని ఆరోపించారు. దేశంలోని పేదలు, కూలీలు, గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించిన అత్యంత కీలకమైన పథకానికి గాంధీ పేరు జత చేయడం వెనుక లోతైన తత్వం ఉందని వారు గుర్తు చేశారు. శ్రమకు గౌరవం, ప్రతి కుటుంబానికి ఉపాధి హక్కు అనే భావన మహాత్మా గాంధీ ఆలోచనల నుంచే పుట్టిందని స్పష్టం చేశారు. అలాంటి పథకం నుంచి ఆయన పేరును తీసివేయడం అంటే భారత రాజ్యాంగ ఆత్మను, స్వాతంత్ర్య ఉద్యమ విలువలను తృణీకరించినట్టేనని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను వక్రీకరించడం, గాంధీ సిద్ధాంతాలను నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారిందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఇప్పుడు ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగించడం ద్వారా దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిందని, ఇది ప్రజాస్వామ్య దేశంలో ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా కోట్లాది మంది పేద కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది వెన్నెముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. అలాంటి ప్రజాప్రయోజన పథకాన్ని రాజకీయ ద్వేషంతో మార్చడం సరికాదని, ఇది పేదల హక్కులపై దాడి చేసి నట్లేనని అన్నారు. మహాత్మా గాంధీ పేరు తొలగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు, నిరసనలు కొనసాగుతాయని, ప్రజల తరఫున పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, గాంధీ ఆశయాలను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాడిగ సందీప్ రాజ్, సురేష్ లాల్, జగ్గు, జాంగిర్, అనిల్, చక్రధర్, కల్పన, శిల్ప చారి, షకీల్ ఖాన్, అమర్, ఇసాక్, సతీష్, శ్యామ్, జై కుమార్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## 37 వసంతాల అందమైన జ్ఞాపకాలు పంచుకున్న బ్యాచ్ మేట్స్



ఏ ఎమ్ న్యూస్ కూకట్పల్లి :
కూకట్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 బ్యాచ్ కు సంబంధించిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కూకట్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇదే పాఠశాలలో పాటలు చెప్పిన రిటైర్డ్ టీచర్ వెంకట్ రెడ్డి, విజయలక్ష్మి లు హాజరు కావడం విశేషం. ఈ యొక్క కార్యక్రమంలో చనిపోయిన ఉపాధ్యాయులకి మా తోటి స్నేహితులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రిటైర్డ్ టీచర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భావి భారత పౌరులే భారతదేశానికి పునాదులు అని చెప్పి మాట్లాడారు. విద్యార్థులను క్రమశిక్షణగలో పెట్టడం మా బాధ్యతని తెలియపరిచారు. ఆరోజుల్లో మేము మీకు సక్రమమైన మార్గాన్ని నిర్దేశించడం వల్లనే ఈరోజు మీ పిల్లలకు కూడా మీరు మంచి మార్గంలో నడిపించడం జరిగిందని, మేము మిమ్ములను క్రమశిక్షణలో పెట్టాము కావున మీరు మీ పిల్లలకి మంచి భవిష్యత్తును ఇచ్చారని తెలిపారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేశారు. విజయలక్ష్మి టీచర్ మాట్లాడుతూ 37 సంవత్సరాల తర్వాత నన్ను మళ్ళీ కూకట్ పల్లి జిల్లా పరిషత్ స్కూల్ పిలిచి గుర్తుంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఎక్కువగా ఒక్కరొక్కరుగా లేచి పరియ పరిచయం చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేస్తూ ఎంతో సంతోషాన్ని తెలియపరిచారు. ఇలాంటి కార్యక్రమాలు అనేకం చేసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నిజాంపేట ఎక్స్ కార్పొరేటర్ కొలను శ్రీనివాస్ రెడ్డి, ఎర్రవెల్లి వాసుదేవరావు, రాజేందర్, శ్రీనివాస్, ఇందిర, భాను రేఖ, ప్రేమలత, వల్లి, పద్మ, సక్కుబాయి, వెంగళరావు, గోపాలకృష్ణ, జీత్ రాజ్ పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఊరికి వెళ్తున్నారా జాగ్రత్త

## - కొల్లూరు సిఐ గణేష్ పటేల్



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
సైబరాబాద్ సైబర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం జిహెచ్ఎంసిలో కలిసిన తెల్లాపూర్ లోని ఉస్మాన్ నగర్ లో ఉన్న కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని ప్రజలకు రాబోయే సంక్రాంతి పండుగ దృష్ట్యా కొల్లూరు పోలీస్ స్టేషన్ సిఐ గణేష్ పటేల్ ప్రజలకు విలువైన సూచనలు ఇచ్చారు ఈ సూచనలలో భాగంగా సంక్రాంతికి ఊరికి వెళ్తున్నారా జాగ్రత్త అంటూ మీ విలువైన బంగారు వెండి ఆభరణాలు డబ్బులు బ్యాంకుల లాకర్లలో, సేఫ్టీ ప్రదేశాలలో భద్రపరచుకోండి, సెలవులలో బయటకు వెళ్తున్నప్పుడు సెక్యూరిటీ అలారం మోషన్ సెన్సార్ ను ఏర్పాటు చేసుకోండి, మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం గల తాలాన్ని అమర్చుకోవడం మరిచిపోకండి,తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే మీ స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారాన్ని ఇవ్వండి,మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారాన్ని అందివ్వండి. మీ వాహనాలను మీ ఇంటి ఆవరణలోనే పార్క్ చేసుకోండి మీ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయండి.మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తాచెదారం న్యూస్ పేపర్, పాల ప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి వాటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడతారు అన్న విషయాన్ని మరిచిపోకండి, నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్లకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పడం మరిచిపోకండి. ఈ సందర్భంగా కొల్లూరు సిఐ గణేష్ పటేల్ మాట్లాడుతూ మీ ఇంటి రక్షణ, మా భద్రత అని అన్నారు.ఎటువంటి సమస్య వచ్చిన కొల్లూరు పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712663379 కి గాని, 100 కి గాని కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కింది సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా కూకట్పల్లి పిఎన్ఎం స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలు

ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఏ ఎమ్ న్యూస్ కూకట్పల్లి :





కూకట్పల్లి పి.ఎన్.ఎమ్ హై స్కూల్ 52 వ వార్షికోత్సవ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని నిర్వహించిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు స్కూల్ చైర్మన్ సిహెచ్ హనుమంతరావు కమిటీ సభ్యులతో కలిసి ముఖ్య అతిథి రఘునందన్ రావు గారికి ఘనంగా స్వాగతం పలకగా ఎన్.సి.సి విద్యార్థులు అతిధులకు గౌరవ వందనం చేశారు. కార్యక్రమం ప్రారంభంలో వందేమాతరం గీతం రచించబడిన 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అందరూ కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం అతిథులను వేదికపైకి ఆహ్వానించి, జ్యోతి ప్రజ్వలనతో అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వార్షికోత్సవ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజల సమక్షంలో ఉత్సాహంగా కొనసాగాయి.

# వినతి పత్రం సమర్పించిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్లోని పలు ప్రాంతాల్లో ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి, నూతన సివరాజ్ లైన్లు ఏర్పాటు చేయడానికి, జిహెచ్ ఎంసి నిధుల నుంచి 40 లక్షల రూపాయలు నిధులను విడుదల చేయాలని శనివారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్.

# తక్షశిలా పబ్లిక్ స్కూల్లో ఔరా తేజోత్సవం ఘనంగా నిర్వహణ



ఏ ఎం న్యూస్ ఓయూ :
తక్షశిలా పబ్లిక్ స్కూల్లో ఔరా తేజో త్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమలోని దాగి ఉన్న ప్రతిభ, ఆలోచనాశక్తి, సృజనాత్మకతను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ప్రదర్శనలు, ప్రాజెక్టులు, ప్రెజెంటేషన్లు అందరినీ ఆకట్టుకు న్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ తను ప్రీత్, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డి మాట్లా డుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లల్లోని కలలు, నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఈ తరహా వేదికలు ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యంగా విద్యార్థిని సాన్వి గౌడ్ ప్రదర్శించిన మానవ ఆరోగ్యానికి సంబంధించిన కొలెస్ట్రాల్ నియంత్రణపై అవగాహన ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంట్లోనే చేయగల సులభమైన చిట్కాలతో కొలెస్ట్రాల్‌ను నియంత్రించవచ్చని ఆమె వివరించడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఔరా తేజోత్సవం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను గుర్తించే వేదికగా నిలిచిందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ఏ ఎం న్యూస్ ఓయూ:
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గం నాచారం రాఘవేంద్ర నగర్ లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. హైదరాబాద్ నాచారం రాఘవేంద్ర నగర్ లో ఉప్పల్ బిజెపి మహిళ మోర్చా కన్వీనర్ అంబాల అనితారెడ్డి సమీక్షంలో నాచారం డిజన్ ప్రధాన కార్యదర్శి ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యేలు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్,బేతి సుభాష్ రెడ్డి, బిజెపి మహిళ మోర్చా రాష్ట్ర నాయకురాలు శిల్పారెడ్డి మోర్చాహాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి సాంప్రదాయాన్ని గుర్తు చేసుకుంటూ సంక్రాంతి పండుగను అంటే రంగుల పండుగ అని మహిళలు వేసిన ముగ్గులు అందర్నీ ఆకట్టుకున్నారు. మొదటి ముగ్గురికి బహుమతులు అందజేశారు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాగిడి మోహన్ రెడ్డి, చెల్లా అశోక్ ముదిరాజ్,ప్రకాష్, నవీన్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# నాచారం x రోడ్ శ్రీ పార్వతి రాజరాజేశ్వర ఆలయంలో hmt నగర్ డివిజన్ బిజెపి నాయకుల పూజలు పోతగాని గోపాల్ గౌడ్..

ఏ ఎం న్యూస్ ఓయూ:



సోమనాథ్ ఆలయం గత వెయ్యి సంవత్సరాలుగా ముష్కరుల దాడులకు గురవ్వుతూ విధ్వంసం తర్వాత పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా సోమనాథ్ ఆలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా ఉన్న మన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ సూచన మేరకు మన డివిజన్లోని నాయకులు,కార్యకర్తలు నాచారం ఠ రోడ్ లోని శ్రీ పార్వతి రాజమహేశ్వర ఆలయంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో పూజలు,భజన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సోమనాథ్ ఆలయం పై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ విదంగా ముష్కరుల దాడిలో ధ్వంసం అయ్యి పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోడీ గారి పిలుపు మేరకు బిజెపి నాయకులు శివాలయంలో పూజ కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ప్రతి హిందువు మేల్కొని హిందూ ఆలయాలు, హిందూ సమాజం పై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి,రాజి రెడ్డి,హన్మంత్ బిరాదర్,డివిజన్ ఉపాధ్యక్షుడు వెంకట్ నాయక్,యోగేశ్వర్ రెడ్డి,గంధమల్ల గోపి, రమేష్,సురేందర్, వేణు,కందారి వెంకటేష్,శుక్లాజి, పద్మ రెడ్డి,అజీజ్ భాయ్,సురేష్, క్రాంతి కుమార్,మంజులవాణి, అరుణ,పార్వతి మరియు ఇతర నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ నూతన కార్యవర్గ ప్రకటన



ఏఎం న్యూస్ ఓయూ:
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ నూతన కార్యవర్గ ప్రకటనకు ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీ అశ్విన్ ఠాకూర్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థి పరిషత్ పని పెరిగే విషయంలో యూనివర్సిటీ విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తు సమాజంలో ఎంత పెద్ద సమస్య అయిన దేనికీ బెదరకుండా యూనివర్సిటీ కేంద్రంగా ప్రశ్నించి సమస్య పరిష్కారం అయినంత వరకు విద్యార్థి పరిషత్ కార్యకర్త ముందడుగు వేస్తారు అని అన్నారు.అలాగే ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీ కో కన్వీనర్ కమల్ సురేశ్ నూతన కార్యవర్గ ప్రకటన చేశారు ఉస్మా నియా యూనివర్సిటీ అధ్యక్షుడిగా గెల్లు శేఖర్ కార్యదర్శిగా మోక్షత్‌ని 60 మందితో కూడిన కార్యవర్గ ప్రకటన చేస్తూ వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ సెక్రటరీ పృథ్వీ తేజ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలు రాజు, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, జిల్లా కన్వీనర్ సాయి తేజ,స్టేట్ మీడియా కన్వీనర్ దృహన్, స్టేట్ ఖేల్ భారత్ కో కన్వీనర్ శివ శంకర్, స్టేట్ లా ఫోరం కో కన్వీనర్ వెంకటేష్,హరిచందన్, విజయ్ సింగ్,శివ,నేతాజీ,మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకృతి-గ్రామీణ ఉత్పత్తుల సమాహారం మూలం సంత

ఏ ఎం న్యూస్ ఓయూ:



గ్రామ భారతీ, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో నిర్వహించిన 19వ మూలం సంత విజయవంతం అయ్యింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైతులు, చేతి వృత్తుల వారు దాదాపు వందకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. గోమాత పూజతో, సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సంబరాలకు అతిథులుగా తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ప్రెసిడెంట్ కప్పెర ప్రసాద్ రావు, చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ కుంభం శోభారెడ్డి, ఆకుతోట రామారావు, మర్రి కృష్ణ, మర్రి రవీందర్రెడ్డి, వసుధాదేవి, సుదర్శన్రెడ్డి, సమంతరెడ్డి, గ్రామ భారతీ ప్రాంత అధ్యక్షురాలు సూర్యకళ, ఊట్కూరి లింగం, ఏకలవ్య గ్రామీణ వికాస్ చైర్మెన్ ఏ.వి. రావు, పలస కరుణాకర్, పడాల రాజమౌళి, మూలం సంత కోఆర్డినేటర్ బొమ్మకంటి మల్లేశం, హేమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గో సేవా విభాగం క్షత్ర ప్రముఖ్ ఆకుతోట రామారావు మాట్లాడుతూ ప్రకృతి, గ్రామీణ చేతి వృత్తుల ఉత్పత్తుల సమాహారం మూలం సంత అని అన్నారు. రసాయన రహిత, పర్యావరణ హితంగా పండించిన వస్తువులు, వివిధ కులవృత్తులు, చేతివృత్తుల వారు తయారు చేసిన వస్తువులే ఈ మూలం సంతలో విక్రయానికి అందుబాటులో ఉంటాయన్నారు. కావునా ఈ లాంటి సంతలను ప్రజలు ఆదరించాలనీ కోరారు. అనంతరం నూతన సంవత్సరం కేలండర్ను ఆవిష్కరించారు.

## కియా సెల్టోస్ ఆవిష్కరణలో

# పాల్గొన్న మాజీమంత్రి ఈటెల రాజేందర్



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నాగోల్‌లోని ఆటోమోటివ్ కియా షోరూమ్‌లో ఆల్-న్యూ కియా సెల్టోస్ను ఘనంగా ప్రారంభ సభలో నిర్వాహకుల ఆహ్వాన మేరకు ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు, మల్కాజ్‌గిరి ఎంపీ, తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరై జ్యోతి ప్రజల్వన చేశారు తరువాత నిర్వాహకులతో కలిసి వాహనాన్ని అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ (11) కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ సంఘ్వీ మాట్లాడుతూ, "భారతదేశంలో కియా యొక్క అతిపెద్ద భాగస్వామి అయిన ఆటోమోటివ్ కియా నిలవడం, మా పరిమాణం, నాణ్యత, కస్టమర్ కేంద్రిత దృక్పథంపై మా దీర్ఘకాలిక నిబద్ధతను స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. 10.99 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో అందుబాటులోకి వచ్చిన ఆల్-న్యూ కియా సెల్టోస్, ఆధునిక టెక్నాలజీతో పాటు మెరుగైన భద్రత, ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని కోరుకునే వినియోగదారులను ఆకట్టుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

## వివిధ రకాల సైబర్ నేరాల గురించి

# ప్రజలకు వివరించిన సీఐ హెచ్. ప్రభాకర్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
ఫిషింగ్ దాడులు, మాల్వేర్ బారిన పడటం, గుర్తింపు దొంగతనం, ఆన్లైన్ మోసాలు, వంటి వివిధ రకాల సైబర్ నేరాల గురించిన విషయాలను ప్రజలకు తెలియపరిచి, వారిలో చైతన్యం కలిగించే విధంగా కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్ గూడా కృష్ణకాంత్ పార్క్ వద్ద శనివారం నిర్వహించారు మధురానగర్ పోలీస్ స్టేషన్ సిఐ హెచ్ ప్రభాకర్. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి( సైబర్ వారియర్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెట్రో కార్ 1 సిబ్బంది బీసీ (1),బీసీ (2)కి సంబంధించిన కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

